# మనం
## హైదరాబాద్
రంగారెడ్డి | మేడ్చల్

మంగళవారం | 20 | అక్టోబర్ | 2026 పేజీలు: 7


## జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ మను చౌదరి



మేడ్చల్, అక్టోబర్ 17: ( మనం జిల్లా ప్రతినిధి): విజయదశమి (దసరా) పండగ సందర్భంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, హృదయపూర్వక విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

3

# మహిషాసురమర్దినిగా గాయత్రీమాత దివ్యదర్శనం

- అన్నోజిగూడలో అంబరాన్నంటిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- భక్తిశ్రద్ధలతో మహా పూర్ణాహుతి... వేదమంత్రాలతో మార్మోగిన ఆలయ ప్రాంగణం
- గణపతి, లక్ష్మీగణపతి, నవగ్రహ సహిత నవచండీ హోమాలతో ఆధ్యాత్మిక శోభ
- అమ్మవారికి ప్రత్యేక పూజలు... ఘనంగా నిత్య కుంకుమార్చనలు
- వేదపండితులకు ఘన సన్మానం... భక్తులకు ఆశీర్వచనాలు
- బోయపల్లి రాజేశ్వర్ రెడ్డి, స్వప్న దంపతుల ఆధ్వర్యంలో మహా అన్నదానం
- వేడుకల్లో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు




ఘట్కేసర్ మనం న్యూస్ అక్టోబర్ 19: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్కేసర్ సర్కిల్, పోచారం 8వ డివిజన్ అన్నోజిగూడ గాయత్రీమాత ఆలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారు మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు. సర్వాలంకార శోభితంగా కొలువుదీరిన జగన్మాతను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

2



# ధర్మానికి ప్రతీక విజయదశమి!

- నేడే దసరా
- పాలపిట్ట దర్శనంలో నమ్మకం.. జమ్మి ఆకుల పంపిణీలో ఆత్మీయత.. తెలంగాణ సంప్రదాయాలకు ప్రత్యేక గుర్తింపు

2



## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్,అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ( డిఆర్ఓ) మాలతి

2



# మహిషాసురమర్దినిగా గాయత్రీమాత దివ్యదర్శనం

**అన్నోజిగూడలో అంబరాన్నంటిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు**

**భక్తిశ్రద్ధలతో మహా పూర్ణాహుతి... వేదమంత్రాలతో మార్మోగిన ఆలయ ప్రాంగణం**

**గణపతి, లక్ష్మీగణపతి, నవగ్రహ సహిత నవచండీ హోమాలతో ఆధ్యాత్మిక శోభ**

**అమ్మవారికి ప్రత్యేక పూజలు... ఘనంగా నిత్య కుంకుమార్చనలు**

**వేదపండితులకు ఘన సన్మానం... భక్తులకు ఆశీర్వచనాలు**

**బోయపల్లి రాజేశ్వర్ రెడ్డి, స్వప్న దంపతుల ఆధ్వర్యంలో మహా అన్నదానం**

**వేడుకల్లో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు**

ఘట్కేసర్ మనం న్యూస్ అక్టోబర్ 19: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్కేసర్ సర్కిల్, పోచారం 8వ డివిజన్ అన్నోజిగూడ గాయత్రీమాత ఆలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారు మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు. సర్వాలంకార శోభితంగా కొలువుదీరిన జగన్మాతను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.



**వేదమంత్రాల నడుమ మహా పూర్ణాహుతి**

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో గణపతి, లక్ష్మీగణపతి, నవగ్రహ సహిత నవచండీ హోమాలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. అమ్మవారికి నిత్య కుంకుమార్చనలు, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని ప్రార్థిస్తూ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. లోకకల్యాణం, ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని ఆకాంక్షిస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**మహిషాసురమర్దిని అలంకరణలో అమ్మవారి దివ్యరూపం**

మహిషాసురమర్దిని అవతారంలో కొలువుదీరిన అమ్మవారి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దుష్టశిక్షణ, శిష్టరక్షణకు ప్రతీకగా నిలిచే మహిషాసురమర్దిని రూపంలో అమ్మవారిని దర్శించుకుని భక్తులు పరవశించిపోయారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో తమ కుటుంబాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీతో పండుగ వాతావరణం నెలకొంది.



**వేదపండితులకు ఘన సన్మానం**

మహా పూర్ణాహుతి అనంతరం వేదపండితులు భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించిన పండితులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించడంలో వేదపండితులు అందించిన సేవలను అభినందించారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

**బోయపల్లి రాజేశ్వర్ రెడ్డి, స్వప్న దంపతుల మహా అన్నదానం**

అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం బోయపల్లి రాజేశ్వర్ రెడ్డి, స్వప్న దంపతుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదానానికి ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమని పలువురు భక్తులు పేర్కొన్నారు.

**ఆధ్యాత్మికతకు నిలయంగా గాయత్రీమాత ఆలయం**

అన్నోజిగూడ గాయత్రీమాత ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రతిరోజూ అమ్మవారిని వివిధ అవతారాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించడం ద్వారా భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కల్పిస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యుల సమన్వయంతో పూజా కార్యక్రమాలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో మహిళలు, యువకులు, చిన్నారులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

**ఉత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులు**

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పోచారం మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, సిద్ధి రాములు గుప్తా, మోహన్ రావు, రాష్ట్ర గిరిజన నాయకుడు జితేందర్ నాయక్, నాయకులు కేఎం రెడ్డి, అంజద్ ఖాన్, చంద్రమోహన్ రెడ్డి, సంతోష్ నాయక్, లక్ష్మణ్ యాదవ్, తిలక్ నాయక్, మాన్విక్ రెడ్డి, ప్రన్వీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలాగే వేదపండితులు కార్తిక్ పంతులు, కౌశిక్ పంతులు, రామ్మూర్తి పంతులు, ప్రసాద్ పంతులు, వేణుగోపాల్ పంతులు, వినీల్, కౌశల్, నవనీత్తో పాటు ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిషాసురమర్దిని అవతారంలో అమ్మవారి దివ్యదర్శనం, మహా పూర్ణాహుతి, వేదపండితుల ఆశీర్వచనాలు, అన్నదాన కార్యక్రమాలతో అన్నోజిగూడ గాయత్రీమాత ఆలయం భక్తజనసందోహంతో కళకళలాడింది.

# ధర్మానికి ప్రతీక విజయదశమి!

**నేడే దసరా**

**పాలపిట్ట దర్శనంలో నమ్మకం.. జమ్మి ఆకుల పంపిణీలో ఆత్మీయత.. తెలంగాణ సంప్రదాయాలకు ప్రత్యేక గుర్తింపు**



మేడ్చల్, అక్టోబర్ 19: (మనం జిల్లా ప్రతినిధి ): దసరా పండుగ చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక. ఆశ్వయుజ మాసంలో తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని పూజించి, పదో రోజున విజయదశమిని ఘనంగా జరుపుకుంటారు.

దుర్గాదేవి మహిషాసురుడిని సంహరించిన రోజు, శ్రీరాముడు రావణుడిపై విజయం సాధించిన రోజుగా విజయదశమికి పురాణాల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.

తెలంగాణలో దసరా ప్రత్యేకత మరింత విశిష్టమైనది. పాలపిట్ట దర్శనం శుభసూచకమనే నమ్మకం, జమ్మి ఆకులను బంగారానికి ప్రతీకగా ఇచ్చిపుచ్చుకోవడం, పెద్దల ఆశీర్వాదాలు తీసుకోవడం ఈ పండుగలో ముఖ్యమైన సంప్రదాయాలు.



విజయదశమి రోజున ఆయుధ పూజ, వాహన పూజ నిర్వహిస్తూ తమ వృత్తికి, జీవనోపాధికి తోడ్పడే పనిముట్లను గౌరవిస్తారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కలుసుకొని ఆనందాన్ని పంచుకుంటారు.

దసరా సందేశం ఒక్కటే.. మనలోని అహంకారం, అసూయ, ద్వేషాన్ని విడిచిపెట్టి ధర్మం, ప్రేమ, ఐక్యతతో ముందుకు సాగాలి. కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని విజయాన్ని సాధించాలి.

చెడుపై మంచి గెలవాలి.. ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలి.. ఇదే విజయదశమి విశిష్టత!



# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

మేడ్చల్, అక్టోబర్ 19: ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్,అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ( డిఆర్ఓ) మాలతి హాజరై అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై బాధితులు, అర్జీదారుల నుంచి మొత్తం 23 దరఖాస్తుల ను స్వీకరించారు.

సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి, ఆచరణాత్మకమైన చర్యలు తీసుకొని త్వరతగతిన సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అధికారులను ఆదేశించారు. బాధితులు సమర్పించిన అర్జీలను పెండింగ్లో పెట్టకుండా నిర్ణీత వ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలనా సిబ్బంది మరియు అర్జీదారులు పాల్గొన్నారు.

# ఆఫర్ల పేరుతో వినియోగదారులకు బురడీ

**సీఎంఆర్ షాపింగ్ మాల్ నిర్వాకం.**

**రూ. 5 వేల బిల్లు చేస్తే వెండి నాణెం ఇస్తామని ఆఫర్**

**వెండి నాణెం కు బదులు వెండి పూత తో ఉన్న బిల్ల ఇస్తూ బురడి**




మేడ్చల్, అక్టోబర్ 19: ( మనం జిల్లా ప్రతినిధి): పండగలను దృష్టిలో పెట్టుకొని వినియోగదారులను ఆకర్షించేందుకు ఆఫర్ల పేరుతో వినియోగదారులను బూరడి కొట్టిస్తున్నారు. పండుగలు అనగానే షాపింగ్ లు చేయడం సహజం. వినియోగదారుల బలహీనతలను క్యాచ్ చేసుకునేందుకు ఆఫర్లు పెడుతూ వినియోగదారులను మోసం చేస్తున్నారు. ఇలాంటి ఘటననే మేడ్చల్ పట్టణంలోని సీఎంఆర్ షాపింగ్ మాల్ లో చోటుచేసుకుంది. రూ.5 వేల బిల్లు చేస్తే వెండి నాణెం ఇస్తామంటూ ఆఫర్ పెట్టారు. ఈ ఆఫర్ ను చూసి ఆశపడ్డ వినియోదారులకు సిఎంఆర్ షాపింగ్ మాల్ వినియోగదారులను బురడి కొట్టిస్తూ వెండి నాణెం కు బదులు వెండి పూత బిల్లను చేతిలో పెడుతూ దిమ్మతిరిగే షాకిస్తున్నారు. పేరుకే వెండి నాణెం.. సీఎంఆర్ షాపింగ్ మాల్ వారు ఇచ్చేది వెండి పూతతో కూడిన బిల్ల ఇస్తున్నారు. మేడ్చల్ కు చెందిన ప్రవీణ్ అనే వ్యక్తి తన కుటుంబంతో షాపింగ్ చేయడానికి సీఎంఆర్ షాపింగ్ మాల్ కు వచ్చాడు. తన ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా రూ. 3 వేల రూపాయల విలువగల షాపింగ్ చేశాడు. అయితే ఏమైనా ఆఫర్లు ఉన్నాయని ప్రశ్నించగా రూ. 5 వేల బిల్లు చేస్తే వెండి నాణెం ఇస్తామని షాపింగ్ మాల్ సిబ్బంది పేర్కొన్నారు. దీంతో ఆశపడ్డ సదర్ వినియోగదారులు ప్రవీణ్ రూ. 5వేల బిల్లు చేశారు. దీంతో ఆఫర్ కింద వెండి నాణెం అంటూ ఓ బి ల్ల ను చేతిలో పెట్టారు.ఇంటికి వెళ్లి దానిని పరిశీలించగా వెండి నాణెం బదులు వెండి పూతతో ఉన్న బిల్లగా గుర్తించారు. వినియోగదారుడు ప్రవీణ్ మర్నాటి రోజు సీఎంఆర్ షాపింగ్ మాల్ కు వెళ్లి సిబ్బందిని నిలదీశారు. వెండి నాణెం ఇస్తామన్నామే తప్ప అది వెండా లేక వెండి పూత నాణెం ఇస్తామని బోర్డు ఎక్కడ పెట్టలేదని వినియోగదారుడు ప్రవీణ్ పై ఆ షాపింగ్ మాల్ మేనేజర్ సుధాకర్ దబాయించారు. ఆఫర్ కింద ఇచ్చిన ( వెండితో కూడిన పూత బిల్ల) విలువ వంద రూపాయలు కూడా ఉండదని, వెండి నాణెం




ఇస్తామంటే రూ. 5 వేల బిల్లు చేశామని, తీరా 100 రూపాయల విలువ లేని వెండి పూతతో కూడిన ఓ నాణెమును తన చేతిలో పెట్టారని సదరు వినియోదారుడు ప్రవీణ్ వాపోతున్నారు.



**వినియోగదారులను ఆకట్టుకునేలా ఆఫర్ల బోర్డులు**

వినియోగదారులను ఆకట్టుకునేలా షాపు ముందే పెద్ద పెద్ద అక్షరాలతో ఆఫర్ల బోర్డును ఏర్పాటు చేశారు.రూ. 5 వేలు బిల్లు చేస్తే వెండి నాణెం ఫ్రీ అంటూ ఆఫర్ల బోర్డును ఏర్పాటు చేశారు. దీనిని చూసినా వినియోగదారులు వెండి నాణెం ఆశతో రూ. 5 వేల బిల్లు చేస్తూ షాపింగ్ మాల్ యాజమాన్యం చేతిలో వినియోగదారులు మోసపోతున్నారు. వెండి నాణెం అనే బదులు వెండి పూతతో కూడిన బిల్లను



ఇస్తామని ఆఫర్ బోర్డుపై పెట్టి ఉంటే బాగుండేది అని వినియోగదారులు పేర్కొంటున్నారు. తన బిజినెస్ ను పెంపొందించుకోవడానికి ఇలా వినియోగదారులను మోసం చేయడం సరైన విధానం కాదు వినియోగదారులు పేర్కొంటున్నారు.

**వినియోగదారులను మోసం చేయడం లేదు**

వినియోగదారులను ఎలాంటి మోసం చేయడం షాపింగ్ మాల్ మేనేజర్ సుధాకర్ పేర్కొన్నారు. షాపు ముందు రూ. 5 వేల బిల్లు చేస్తే వెండి నాణెం ఇస్తాం అంటూ ఆఫర్ పెట్టిన మాట వాస్తవమేనని అయితే ఎంత మోతాదులో ఇస్తామో మేము ఏ ఆఫర్ బోర్డు మీద పెట్టలేదని తెలిపారు. వెండి నాణెం ఇస్తామా.. పూతతో కూడిన నాణెం ఇస్తామా ఆఫర్ బోర్డ్ మీద పెట్టలేదని దురుసుగా సమాధానం చెప్పారు. వెండి నాణెం ఇస్తామని ఆఫర్ ఇచ్చి ఇలా వెండి పూతతో కూడిన నాణెం ఇవ్వడం మోసం కాదా అంటూ విలేకరులు ప్రశ్నిస్తే ఎలా మోసం అవుతుంది అంటూ ఎదురు ప్రశ్న వేశారు.

**ఆఫర్లు అనగానే తొందర పడవద్దు**

ఆఫర్లు అనగానే తొందరపడి ఏది కొనవద్దని, ఆలోచించి వివరాలు అన్నీ తెలుసుకున్నాక కొనుగోలు చేయాలని ఆర్థిక వేత్తలు పేర్కొంటున్నారు. ఇందుకు నిదర్శనం సిఎంఆర్ షాపింగ్ మాల్ ఏ కారణమని, రూ. 5 వేల బిల్ చేస్తే వెండి నాణెం ఇస్తామని ఆఫర్ పెట్టడం వారి బిజినెస్ టెక్నిక్ అని వినియోగదారులు పూర్తి వివరాలు తెలుసుకొని ముందుకు పోవాలని. ఇలా మోసపోవద్దని ఆర్థిక వేత్తలు పేర్కొంటున్నారు.

---

# దసరా పర్వదినాన సేవాభావం

**చేవెళ్ల మున్సిపల్ 9వ వార్డు సిబ్బందికి దసరా కానుకగా నూతన వస్త్రాలు**

**మాజీ సర్పంచ్ రెడ్డి శెట్టి మధుసూదన్ గుప్తా ఆధ్వర్యంలో వస్త్రాల పంపిణీ**

చేవెళ్ల, అక్టోబర్ 19(మనం న్యూస్): విజయదశమి దసరా పండుగను పురస్కరించుకుని చేవెళ్ల మున్సిపల్ 9వ వార్డులో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి దామరగిద్ద మాజీ సర్పంచ్ రెడ్డి శెట్టి మధుసూదన్ గుప్తా, మాజీ ఉపసర్పంచ్ మాల వెంకటయ్య నూతన వస్త్రాలను అందజేశారు. పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని సిబ్బందికి వస్త్రాలు పంపిణీ చేసి, వారితో కలిసి దసరా పండుగ సంతోషాలను పంచుకున్నారు.

ఈ సందర్భంగా..... మాజీ సర్పంచ్ రెడ్డి శెట్టి మధుసూదన్ గుప్తా మాట్లాడుతూ..... పండుగలు ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాన్ని, ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు. సమాజానికి సేవలందించే సిబ్బందిని గౌరవించడం, పండుగ సమయాల్లో వారితో సంతోషాలను పంచుకోవడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. విజయదశమి పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని, అందరి ఇళ్లలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

నూతన వస్త్రాలు అందుకున్న 9వ వార్డు సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తూ, వస్త్రాలు అందజేసిన రెడ్డి శెట్టి మధుసూదన్ గుప్తా, మాల వెంకటయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొడ్డి సత్తయ్య, అక్నాపురం నర్సింలు, చాకలి రాములు, తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్, అక్టోబర్ 17: ( మనం జిల్లా ప్రతినిధి): విజయదశమి (దసరా) పండగ సందర్భంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, హృదయపూర్వక విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రతీ ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులను, సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. దుర్గామాత ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో విలసిల్లాలని, ప్రజలందరూ ఈ పండుగను శాంతియుత వాతావరణంలో, ఆనందోత్సాహాల మధ్య మరియు సోదరభావంతో జరుపుకోవాలని, ప్రతి అడుగు విజయవంతం కావాలని కోరుకున్నారు.



# మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఆరోగ్య శాఖలో ఉద్యోగాలు

**16 విభాగాల్లో 120 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల**

**రూ.15,600 నుంచి రూ.52,000 వరకు నెలవారీ వేతనం.. అక్టోబర్ 23 నుంచి దరఖాస్తుల స్వీకరణ**




మేడ్చల్, అక్టోబర్ 19: ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో ఆరోగ్య శాఖలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. జాతీయ ఆరోగ్య మిషన్, పట్టణ జాతీయ ఆరోగ్య మిషన్ తదితర ఆరోగ్య పథకాల కింద వివిధ విభాగాల్లో మొత్తం 16 రకాల పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన ఒప్పంద, బాహ్య సంస్థల ద్వారా నియామక పద్ధతిలో భర్తీ చేయనున్నారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి నోటిఫికేషన్ విడుదల చేశారు. అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

## 16 విభాగాల్లో 120 పోస్టులు

నోటిఫికేషన్ ప్రకారం వైద్యాధికారులు, సిబ్బంది నర్సులు, సహాయక సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ప్రయోగశాల సాంకేతిక నిపుణులు, ఔషధ నిపుణులు, వ్యాధుల పరిశీలన నిపుణులు, ప్రజారోగ్య నిర్వహణాధికారులు తదితర పోస్టులను భర్తీ చేయనున్నారు.

వైద్యాధికారులు 17, సిబ్బంది నర్సులు 32, సహాయక సిబ్బంది 8, సామాజిక ఆరోగ్య అధికారులు సహా వైద్యాధికారుల విభాగంలో 13, జిల్లా వ్యాధుల పరిశీలన నిపుణుడు 1, అసంక్రమిత వ్యాధుల విభాగంలో సిబ్బంది నర్సు 1, ఏఎన్ఎం ఆరోగ్య కార్యకర్తలు 8, ప్రయోగశాల సాంకేతిక నిపుణులు 16, ఔషధ నిపుణులు 2, పట్టణ ఆరోగ్య మిషన్ సిబ్బంది నర్సులు 17 పోస్టులు ఉన్నాయి.

అలాగే ప్రజారోగ్య నిర్వహణాధికారి 1, పాఠశాల వయస్సు పిల్లల ఆరోగ్య కార్యక్రమం కింద ఔషధ నిపుణుడు 1, క్షయ వ్యాధి నియంత్రణ కార్యక్రమం కింద సమన్వయకర్త 1, జిల్లా కేంద్ర ఔషధ విభాగంలో ఔషధ నిపుణుడు 1, చిన్న ఆరోగ్య కేంద్ర నిర్వహణాధికారి 1, చిన్న ఆరోగ్య కేంద్రంలో సహాయక సిబ్బంది 1 పోస్టును భర్తీ చేయనున్నారు.

## విద్యార్హతలు.. వేతనాల వివరాలు

వైద్యాధికారుల పోస్టులకు ఎంబీబీఎస్ పూర్తి చేసి తెలంగాణ వైద్య మండలిలో నమోదు చేసుకుని ఉండాలి. వీరికి నెలకు రూ.52,000 వేతనం చెల్లిస్తారు. సిబ్బంది నర్సుల పోస్టులకు నర్సింగ్లో పట్టా లేదా సంబంధిత డిప్లొమా పూర్తి చేసి, తెలంగాణ నర్సింగ్ మండలిలో నమోదు కలిగి ఉండాలి. వీరికి నెలకు రూ.29,900 వేతనం అందుతుంది.

సహాయక సిబ్బంది పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణత అవసరం. నెలకు రూ.15,600 వేతనం చెల్లిస్తారు. సామాజిక ఆరోగ్య అధికారులు, వైద్యాధికారుల విభాగంలో పోస్టులకు సంబంధిత వైద్య, ఆయుర్వేద లేదా నర్సింగ్ విద్యార్హతలు, అవసరమైన మండలి నమోదు ఉండాలి. అర్హతను బట్టి నెలకు రూ.29,900 లేదా రూ.40,000 వేతనం ఉంటుంది.

జిల్లా వ్యాధుల పరిశీలన నిపుణుడి పోస్టుకు వైద్య విద్యతో పాటు ప్రజారోగ్యం, వ్యాధుల పరిశీలనకు సంబంధించిన ఉన్నత విద్యార్హతలు లేదా నోటిఫికేషన్లో పేర్కొన్న అనుభవం అవసరం. ఈ పోస్టుకు నెలకు రూ.50,000 వేతనం నిర్ణయించారు.

అసంక్రమిత వ్యాధుల విభాగంలోని సిబ్బంది నర్సు పోస్టుకు నర్సింగ్ అర్హతతో పాటు సంబంధిత మండలిలో నమోదు తప్పనిసరి. ఏఎన్ఎం పోస్టులకు సంబంధిత శిక్షణ, నమోదు అర్హతలు ఉండాలి. ఈ రెండు విభాగాల్లో వరుసగా నెలకు రూ.29,900, రూ.27,300 వేతనం చెల్లిస్తారు.

ప్రయోగశాల సాంకేతిక నిపుణుల పోస్టులకు ఇంటర్మీడియట్తో పాటు వైద్య ప్రయోగశాల సాంకేతిక విద్యలో డిప్లొమా లేదా తత్సమాన అర్హత, సంబంధిత మండలిలో నమోదు అవసరం. ఔషధ నిపుణుల పోస్టులకు ఔషధశాస్త్రంలో పట్టా లేదా డిప్లొమా, సంబంధిత ఫార్మసీ మండలిలో నమోదు ఉండాలి. ఈ పోస్టులకు నెలకు రూ.27,300 వేతనం చెల్లిస్తారు.

ప్రజారోగ్య నిర్వహణాధికారి పోస్టుకు సంబంధిత విభాగంలో పట్టభద్రతతో పాటు ప్రజారోగ్యం లేదా సామాజిక ఆరోగ్య నిర్వహణలో ఉన్నత విద్యార్హత, కనీసం రెండేళ్ల అనుభవం అవసరం. ఈ పోస్టుకు నెలకు రూ.19,500 వేతనం నిర్ణయించారు.

క్షయ వ్యాధి నియంత్రణ కార్యక్రమంలోని సమన్వయకర్త పోస్టుకు సామాజిక సేవ లేదా వ్యాపార నిర్వహణలో ఉన్నత విద్యార్హత, సంబంధిత రంగంలో కనీసం ఏడాది అనుభవం, ద్విచక్ర వాహనం నడపగల నైపుణ్యం అవసరం. ఈ పోస్టుకు నెలకు రూ.26,410 వేతనం చెల్లిస్తారు.

చిన్న ఆరోగ్య కేంద్ర నిర్వహణాధికారి పోస్టుకు ఆరోగ్య నిర్వహణలో వ్యాపార నిర్వహణ పట్టా లేదా సంబంధిత ఉన్నత విద్యార్హతతో పాటు ఆరోగ్య కార్యక్రమాల్లో కనీసం రెండేళ్ల అనుభవం అవసరం. ఈ పోస్టుకు నెలకు రూ.30,000 వేతనం ఉంటుంది. జిల్లా కేంద్ర ఔషధ విభాగంలోని ఔషధ నిపుణుడి పోస్టుకు ఔషధశాస్త్రంలో డిప్లొమా, సంబంధిత మండలిలో నమోదు అవసరం. నెలకు రూ.27,300 వేతనం చెల్లిస్తారు.

## అక్టోబర్ 23 నుంచి దరఖాస్తుల స్వీకరణ

దరఖాస్తుల స్వీకరణ అక్టోబర్ 23 నుంచి అక్టోబర్ 28, 2026 వరకు కొనసాగుతుంది. ఆదివారం మినహా నిర్ణీత రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు.

అభ్యర్థులు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్పేట మండలం అంతాయిపల్లిలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలి.

దరఖాస్తుతో పాటు రూ.500 రిజిస్ట్రేషన్ రుసుమును డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో జతచేయాలి. డిమాండ్ డ్రాఫ్ట్ను ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పేరిట పొందాలి. విద్యార్హత ధ్రువపత్రాలు, సంబంధిత మండలి నమోదు ధ్రువపత్రాలు, ఇతర అవసరమైన పత్రాలను దరఖాస్తుతో పాటు సమర్పించాలి.

## అధికారిక వెబ్సైట్లో పూర్తి వివరాలు

నోటిఫికేషన్ సంఖ్య 286/E1/–MHO/M–CL/2026 కాగా, 2026 అక్టోబర్ 19న నోటిఫికేషన్ విడుదలైంది. దరఖాస్తు నమూనా, అర్హతలు, ఎంపిక విధానం, ఇతర నిబంధనల కోసం అభ్యర్థులు జిల్లా అధికారిక వెబ్సైట్ను సందర్శించాలి.

వెబ్సైట్: https://medchal&malkajgiri.telangana.gov.in

ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే సమయానికి అందుబాటులో ఉన్న ఖాళీలను బట్టి పోస్టుల సంఖ్య పెరగవచ్చు లేదా తగ్గవచ్చని నోటిఫికేషన్లో పేర్కొన్నారు. కాబట్టి అభ్యర్థులు దరఖాస్తు చేసే ముందు పూర్తి నోటిఫికేషన్ను జాగ్రత్తగా పరిశీలించి, తమ విద్యార్హతలకు అనుగుణమైన పోస్టులకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సూచించారు.

# చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

**మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన..**

**మృతుడి వయస్సు 30 నుంచి 35 ఏళ్లు.. వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి..**



సికింద్రాబాద్, అక్టోబర్ 19 (మనం న్యూస్) మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గాయాలతో ఆసుపత్రిలో చేరిన గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో అతడిని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మార్కెట్ పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 15వ తేదీ రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో గ్రీన్ హోటల్ సమీపంలోని సిద్ధి వినాయక స్క్రాప్ దుకాణం వద్ద గుర్తుతెలియని వ్యక్తి రక్తగాయాలతో పడి ఉండటాన్ని దుకాణ యజమాని కొండూరి చంద్రశేఖర్ గమనించారు. వెంటనే 108 అంబులెన్స్ సేవలకు, మార్కెట్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది, పోలీసులు గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 16వ తేదీ తెల్లవారుజామున 4.10 గంటలకు మృతి చెందినట్లు ఆసుపత్రి నుంచి సమాచారం అందింది. మృతుడి వయస్సు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందని, ఐదు అడుగుల ఎత్తు, చామనఛాయ, నల్లటి జుట్టు, గుండ్రటి ముఖం కలిగి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతుడు తెల్లటి చొక్కా, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడి పేరు, కుటుంబ వివరాలు తెలియరాలేదని వెల్లడించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న మార్కెట్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె. మహేశ్వరి తదుపరి చర్యలు చేపట్టారు. మృతుడిని గుర్తించినవారు లేదా అతడి కుటుంబ సభ్యుల వివరాలు తెలిసినవారు మార్కెట్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె. మహేశ్వరి నంబర్ 8712660243 లేదా మార్కెట్ పోలీస్ స్టేషన్ నంబర్ 8712661255కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# ఘనంగా మేడ్చల్ డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ జన్మదిన వేడుకలు



మేడ్చల్, అక్టోబర్ 19: ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ మల్కాజ్గిరి డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేతలు వజ్రేష్ యాదవ్లో ను కలిసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువా కప్పి సన్మానించారు. మాజీ డిసిసి అధ్యక్షులు హరి వర్ధన్ రెడ్డి,గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గరిసెల సురేందర్ ముదిరాజ్, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు గువ్వ రవి, మాజీ జెడ్పిటిసి, మాజీ కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్ పాల్గొని వజ్రెష్ యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# భక్తితో అన్నదానం.. సేవలో ఆదర్శంగా

**41 రోజులుగా గడిమైసమ్మ ఆలయంలో మణికంఠ ఆధ్వర్యంలో అన్నదానం**

**కీర్తిశేషులు రాజేశ్వర్ గౌడ్ (చిలకరాజు )కూతురు**

**ఈరోజు సంతోషిని చేతులమిదిగా అన్నం ఒడ్డించారు**

**భక్తులకు అన్నప్రసాద వితరణ.. సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న కుటుంబం**

**భవానీ మాలధారులకే కాదు.. మాల ధరించని భక్తులకూ అన్నదానం**

మేడ్చల్, అక్టోబర్ 19: ( మనం జిల్లా ప్రతినిధి): భక్తి, సేవాభావం, దాతృత్వం కలగలిసిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి మేడ్చల్లోని శ్రీ శ్రీ గడిమైసమ్మ అమ్మవారి దేవాలయం వేదికగా నిలుస్తోంది. అమ్మవారి ఆశీస్సులతో భవానీ దీక్ష చేపట్టిన భక్తులకు, ఆలయానికి వచ్చే ఇతర భక్తులకు అన్నదానం చేయడం ద్వారా సేవాభావాన్ని చాటుకుంటున్నారు. గత 41 రోజులుగా కొనసాగుతున్న ఈ అన్నదాన కార్యక్రమం భక్తులలో సంతోషాన్ని నింపుతోంది.

మేడ్చల్ మాజీ సర్పంచ్ సుధా రాజేశ్వర్ గౌడ్ (చిలక రాజు) కుటుంబం అమ్మవారి సేవలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. సెప్టెంబర్ 10 నుంచి అక్టోబర్ 19 వరకు అన్నదాన సేవ కొనసాగడం విశేషం. భవానీ మాల ధరించిన భక్తులతో పాటు మాల ధరించని వారికి కూడా అన్నప్రసాదం అందిస్తూ, అన్నదానానికి ఎలాంటి భేదభావాలు ఉండవని చాటుతున్నారు.



**కుటుంబ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమం**

కుటుంబ పెద్దలు చూపిన సేవా మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని, తరువాతి తరాలు కూడా ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అభినందనీయమని పలువురు భావిస్తున్నారు. సంతోషిని చేతుల మీదుగా అమ్మవారి ఆలయంలో అన్నదానం నిర్వహించడం ఆనందంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. తమ తండ్రి చూపిన మార్గంలోనే కుటుంబ సభ్యులు కూడా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుండటం సంతోషంగా ఉందని పేర్కొంటూ, ఈ సేవను ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అదేవిధంగా కుటుంబ సభ్యుడు మంకంఠ గౌడ్



కూడా భవానీ దీక్షలో ఉన్న మాలధారులకు, మాల ధరించని భక్తులకు అన్నదానం అందిస్తూ సేవా కార్యక్రమంలో భాగస్వామిగా నిలిచారు.

**అన్నదానమే మహాదానం**

ఆధ్యాత్మిక సంప్రదాయాల్లో అన్నదానానికి ప్రత్యేక స్థానం ఉంది. ఆకలితో వచ్చినవారికి అన్నం పెట్టడం, భక్తులకు ఆహారం అందించడం గొప్ప సేవగా భావిస్తారు. దేవాలయాల్లో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు భక్తిభావాన్ని పెంపొందించడమే కాకుండా, సమాజంలో మానవత్వం, ఐక్యత, పరస్పర సహకారం వంటి విలువలను బలపరుస్తాయి.

శ్రీ గడిమైసమ్మ అమ్మవారి ఆలయంలో 41 రోజులుగా కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమం సేవాభావానికి నిదర్శనంగా నిలుస్తోంది. భక్తి అనేది పూజలకే పరిమితం కాకుండా, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం వంటి సేవా కార్యక్రమాల ద్వారా కూడా వ్యక్తమవుతుందని ఈ కార్యక్రమం చాటిచెబుతోంది.



## దసరా కానుకగా శక్తి స్వరూపులైన మహిళా మోర్చా నాయకురాల్లకు, కార్యకర్తలకు చీరలు పంపిణీ

**బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్**

మనం న్యూస్ // మియాపూర్, సెప్టెంబర్ 19: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని భారతీయ జనతా పార్టీ బీజేపీ మహిళా మోర్చా సోదరీమణులకు దసరా కానుకగా చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ రవికుమార్ యాదవ్ ఈ కార్యక్రమాన్ని స్వయంగా నిర్వహించి, పార్టీ మహిళా నాయకురాళ్లకు, కార్యకర్తలకు చీరలను అందజేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు, విశిష్టతకు దసరా మరియు బతుకమ్మ పండుగలు ప్రతీకలని కొనియాడారు. సమాజ హితం కోసం, పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో నిరంతరం శ్రమిస్తున్న మహిళా కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని ఆయన పేర్కొన్నారు. పండుగ వేళ మహిళా సోదరీమణుల మోములో చిరునవ్వులు చూడటం ఎంతో సంతోషాన్ని, సంతృప్తిని ఇచ్చిందని అన్నారు, ఈ విజయదశమి పర్వదినం శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలతో పాటు పార్టీ శ్రేణులందరి జీవితాల్లోనూ సుఖసంతోషాలు, విజయాలు నింపాలని ఆకాంక్షిస్తూ, మహిళా మోర్చా నాయకురాళ్లకు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేకంగా దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి పద్మ, కాంటెస్టెడ్ కార్పొరేటర్ అనూష యాదవ్, నాయకురాళ్ళు వినయ, శారద, మహేశ్వరి , శోభా, సరోజ, విజయలక్ష్మి, నాయకులు మహేష్ యాదవ్, ప్రసాద్ రెడ్డి మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ, మహిళా మోర్చా ముఖ్య నాయకురాళ్ళు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రావణాసుర బొమ్మ దహన కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుంది

**రావణాసురుడి దహన కార్యక్రమానికి రామన్న గారి రాఘవేందర్ గౌడ్ రూ. 1.50 లక్షల విరాళం**

మేడ్చల్, అక్టోబర్ 19: ( మనం జిల్లా ప్రతినిధి): ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం సైతం మేడ్చల్ లో రావణాసురుడి దహన కార్యక్రమం ఉంటుందని బొడ్డాయి కమిటీ సభ్యులు చెరుపుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, రామన్న గారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. దసరా ఉత్సవాలలో భాగంగా మేడ్చల్ కింది బస్తి యువకులు రావణాసుర బొమ్మను తయారుచేసి దసరా పండుగ రోజున పెద్దమనుషులతో దహనం చేయించడం ఆనవాయితీగా వస్తుందని వారు తెలిపారు. ఈ దసరా సందర్భంగా సైతం ఎప్పటిలాగే రావణాసురుడి దహన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కోసం ఆర్ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, నాయకులు రామన్న గారి రాఘవేందర్ గౌడ్ 150,000 అందజేశారని ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెరుపుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, రామన్న గారి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.

## 24 గంటల్లో అరెస్ట్ చేయాలి.. లేదంటే డీజీపీ కార్యాలయం ముట్టడే!

**కట్టమైసమ్మ ఆలయ ఘటనపై ఏబీవీపీ తీవ్ర హెచ్చరిక..**

**వేలాది మంది విద్యార్థులతో ఆందోళనకు సిద్ధం: జీవన్..**

సికింద్రాబాద్, అక్టోబర్ 19 (మనం న్యూస్) ఉస్మానియా యూనివర్సిటీలోని మెయిన్ చెరువు సమీపంలో కట్టమైసమ్మ అమ్మవారి ఆలయంపై దాడి జరిగిందన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఆలయ గేట్లను ధ్వంసం చేసి, అమ్మవారి విగ్రహంతో పాటు పూజా సామగ్రిని అపహరించిన ఘటనపై ఏబీవీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను తేలిగ్గా తీసుకోవద్దని, బాధ్యులను తక్షణమే గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జీవన్ పోలీసులను డిమాండ్ చేశారు. ఆలయంపై జరిగిన ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని, ఫొటోలు బయటకు రాకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలపైనా స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. విద్యార్థుల విశ్వాసాలకు, విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఆలయాలకు రక్షణ కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు.

**24 గంటల్లో నిందితుల అరెస్ట్ తప్పనిసరి..**



కట్టమైసమ్మ అమ్మవారి ఆలయ ఘటనలో బాధ్యులను 24 గంటల్లో గుర్తించి అరెస్ట్ చేయాలని జీవన్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. గడువులోగా చర్యలు తీసుకోకపోతే ఉస్మానియా యూనివర్సిటీ నుంచి వేలాది మంది విద్యార్థులతో భారీ ఆందోళన చేపట్టి డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రకటించారు. ఆలయ ఘటనపై పారదర్శక విచారణ జరిపి దోషులను చట్టం ముందు నిలబెట్టే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు.



## ఆర్చరీ ప్రీమియర్ లీగ్-2 చాంపియన్గా మైటీ మరాఠాస్

హైదరాబాద్, అక్టోబర్ 19 (మనం న్యూస్) : ఆర్చరీ ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) రెండో సీజన్లో మైటీ మరాఠాస్ చాంపియన్గా నిలిచింది. హైదరాబాద్లోని పీపుల్స్ ప్లాజాలో జరిగిన ఫైనల్లో కాకతీయ నైట్స్ను 6-2తో ఓడించింది. ఫైనల్లో బొమ్మదేవర ధీరజ్ 79/80, మైక్ ష్లోసర్ 80/80 పాయింట్లతో రాణించారు. ధీరజ్ టోర్నమెంట్ ఉత్తమ రికర్వ్ పురుష ఆర్చర్గా ఎంపికయ్యాడు. రెండో ఎలిమినేటర్లో మరాఠాస్ పృథ్వీరాజ్ యోధాస్ను 5-3తో ఓడించి ఫైనల్కు చేరింది. అమన్ సైనీ స్థానంలో మైక్ ష్లోసర్, అలెజాండ్రా వాలెన్సియా స్థానంలో సిమ్రన్జీత్ కౌర్ ఆడారు. కాకతీయ నైట్స్ తరఫున నికో వీనర్, జ్యోతి సురేఖ, ఎలియా కనాల్స్, నీరజ్ చౌహాన్ పోటీపడ్డారు. టోర్నమెంట్ ఉత్తమ ఆర్చర్లుగా రికర్వ్ మహిళల విభాగంలో సంగీత(రాజ్పుతానా రాయల్స్), కాంపౌండ్ పురుషుల్లో మథియాస్ ఫుల్లర్టన్(చేరో), కాంపౌండ్ మహిళల్లో అలెజాండ్రా ఉస్కియానో(చోళ) ఎంపికయ్యారు.

# బోడుప్పల్లో ఘనంగా తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదిన వేడుకలు

**కాంగ్రెస్ శ్రేణుల సందడితో పండుగ వాతావరణం**

**జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు**

**వజ్రేష్ యాదవ్కు ఘన సత్కారం.. వెల్లువెత్తిన జన్మదిన శుభాకాంక్షలు**

**శాలువాతో సత్కరించిన మాజీ మున్సిపల్ చైర్మన్ ముల్లి జంగయ్య యాదవ్, మహమ్మద్ అబ్దుల్ ఖయ్యుమ్**

**ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడిగా ప్రశంసలు**

**కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో వజ్రేష్ యాదవ్ కృషి అభినందనీయమన్న నాయకులు**

**భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్ష**

**వేడుకల్లో సందడి చేసిన ఘట్కేసర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు**



ఘట్కేసర్ మనం న్యూస్ అక్టోబర్ 19: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదిన వేడుకలు బోడుప్పల్లో అంగరంగ వైభవంగా జరిగాయి. సోమవారం బోడుప్పల్లోని దేవి కన్వెన్షన్ హాల్ వేదికగా నిర్వహించిన జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సందడితో పండుగ వాతావరణాన్ని తలపించాయి. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పార్టీ శ్రేణులు వజ్రేష్ యాదవ్కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నాయకులు, అభిమానుల ఆత్మీయ పలకరింపులు, అభినందనలతో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.

ఈ సందర్భంగా ఘట్కేసర్ మాజీ మున్సిపల్ చైర్మన్ ముల్లి జంగయ్య యాదవ్, ఘట్కేసర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ ఖయ్యుమ్ ప్రత్యేకంగా హాజరై తోటకూర వజ్రేష్ యాదవ్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

**పార్టీ బలోపేతానికి వజ్రేష్ యాదవ్ కృషి అభినందనీయం**

ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ ముల్లి జంగయ్య యాదవ్, మహమ్మద్ అబ్దుల్ ఖయ్యుమ్ మాట్లాడుతూ.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు తోటకూర వజ్రేష్ యాదవ్ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేయడం ఆయన నాయకత్వానికి నిదర్శనమని అభిప్రాయపడ్డారు.

కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, పార్టీ శ్రేణులను ఏకతాటిపై నడిపించడంలో వజ్రేష్ యాదవ్ చురుకైన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించే నాయకులకు కార్యకర్తల ఆదరణ ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడేందుకు ఆయన నాయకత్వం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**ప్రజల అభిమానమే నాయకుడికి నిజమైన బలం**

ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునే నాయకులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. రాజకీయాల్లో పదవుల కంటే ప్రజల విశ్వాసం, కార్యకర్తల అభిమానం ఎంతో విలువైనవని అభిప్రాయపడ్డారు. జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వజ్రేష్ యాదవ్కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం ఆయనపై ఉన్న అభిమానానికి నిదర్శనమని అన్నారు.

రానున్న రోజుల్లో వజ్రేష్ యాదవ్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయనకు భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని ప్రార్థించారు. ప్రజా సేవలో మరిన్ని విజయాలు సాధిస్తూ రాజకీయంగా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.

**కాంగ్రెస్ శ్రేణుల సందడితో కళకళలాడిన వేడుకలు**

బోడుప్పల్లో జరిగిన జన్మదిన వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో దేవి కన్వెన్షన్ హాల్ సందడిగా మారింది. పలువురు నాయకులు వజ్రేష్ యాదవ్ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. పరస్పర ఆత్మీయ పలకరింపులు, శుభాకాంక్షలతో వేడుకలు ఉత్సాహంగా కొనసాగాయి.

ముఖ్యంగా ఘట్కేసర్ డివిజన్ నుంచి హాజరైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వేడుకల్లో ప్రత్యేక సందడి చేశారు. పార్టీ పటిష్ఠతకు నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి అవసరమని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మాజీ మున్సిపల్ చైర్మన్ ముల్లి జంగయ్య యాదవ్, ఘట్కేసర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ ఖయ్యుమ్తో పాటు ఘట్కేసర్ డివిజన్కు చెందిన పలువురు ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చేవెళ్లలో వివాహిత మహిళ అదృశ్యం

**ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి**



చేవెళ్ల, అక్టోబర్ 19(మనం న్యూస్): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీకి చెందిన పుట్ట అలివేలమ్మ (20) అదృశ్యమైంది. ఈ మేరకు ఆమె భర్త పల్లె గోనల బాలరాజ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్లలోని టీచర్స్ కాలనీలో నివాసముంటున్న బాలరాజ్కు, పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లికి చెందిన పుట్ట అలివేలమ్మతో ఏడాది క్రితం వివాహమైంది. ప్రస్తుతం అలివేలమ్మ చేవెళ్లలోని ఓ బుక్స్టోర్లో పనిచేస్తోంది. ఈ నెల 19వ తేదీ ఉదయం సుమారు 7 గంటలకు బాలరాజ్ కూలి పనులకు వెళ్లాడు. అనంతరం ఉదయం 11 గంటల సమయంలో అతని అత్త వీరమ్మ ఫోన్ చేసి, అలివేలమ్మ ఇంటి నుంచి బ్యాగ్ తీసుకొని వెళ్లిపోయినట్లు సమాచారం ఇచ్చింది. దీంతో ఇంటికి వచ్చి చూడగా ఆమె కనిపించలేదు. అలివేలమ్మ స్నేహితులు ఉంటున్న గదిని ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు, వారితో పాటు ఆమె కూడా వెళ్లినట్లు తెలిసింది. అలివేలమ్మ పనిచేస్తున్న బుక్స్టోర్ యజమానిని విచారించగా, గత రెండు రోజులుగా ఆమె విధులకు రావడం లేదని తెలిపారు. ఈ నెల 19వ తేదీ ఉదయం సుమారు 9 గంటలకు పాన్షాప్ వద్దకు వచ్చి, జడ వేసుకొని వస్తానని చెప్పి వెళ్లినట్లు సమాచారం ఇచ్చారు. బంధువులు, తెలిసినవారి వద్ద, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో భర్త పోలీసులను ఆశ్రయించాడు. అదృశ్యమైన మహిళ వివరాలు: పుట్ట అలివేలమ్మ, వయస్సు 20 సంవత్సరాలు, ఎత్తు సుమారు 5 అడుగుల 3 అంగుళాలు, చామనఛాయ, తెలుగు భాష మాట్లాడుతుంది. అదృశ్యమైన సమయంలో డ్రెస్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అలివేలమ్మ ఆచూకీ తెలిసిన వారు లేదా ఎక్కడైనా గుర్తించిన వారు సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని చేవెళ్ల పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కోరారు.

# అలియాబాద్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

**చెట్టును ఢీకొని ఇద్దరు యువ కార్మికులు దుర్మరణం**

శామీర్ పేట్, అక్టోబర్ 19 (మనం ): అలియాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువ కార్మికులు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... జార్ఖండ్కు చెందిన కాస్మోస్ మార్కి (22), సుమిత్ కుళ్ళు (23) అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని డైనమిక్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి కంపెనీలో దసరా వేడుకల్లో పాల్గొన్న అనంతరం బైక్ పై వెళ్తుండగా, రాత్రి 11:30 గంటల సమయంలో బ్రిందా కన్వెన్షన్ హాల్ సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న జీనోమ్ వ్యాలీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దసరా వేళ ఇద్దరు యువకులు మృతిచెందడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

# తోటకూర వజ్రేష్ యాదవ్కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తునికి రమేష్

శామీర్ పేట్, అక్టోబర్ 19 (మనం ): మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదిన వేడుకలు బోడుప్పల్లోని దేవి కన్వెన్షన్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలియాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తునికి రమేష్ పలువురు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షించారు. ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజల మన్ననలు పొందాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.



# భక్తి భావంలో మల్లాపూర్.. ఘనంగా శారదీయ దుర్గోత్సవం

**ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు..**

**ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థన.. బంగీయ సంఘం ఆధ్వర్యంలో మూడో ఏడాది వేడుకలు..**





నాచారం, అక్టోబర్ 19(మనం న్యూస్) భక్తి, ఆధ్యాత్మికత, సాంస్కృతిక సంప్రదాయాల సమ్మేళనంగా మల్లాపూర్ లో శ్రీ శ్రీ శారదీయ దుర్గోత్సవం- 2026 వేడుకలు ఘనంగా కొనసాగాయి. మల్లాపూర్ బంగీయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మూడవ సంవత్సరం గ్రాండ్ పూజా కార్యక్రమం భక్తజనుల సందడితో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, ఉప్పల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని దుర్గామాతను ప్రార్థించారు. ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని, ప్రజల జీవితాల్లో శాంతి, సౌభాగ్యాలు నిండాలని ఆకాంక్షించారు. మల్లాపూర్ లోని వీ.ఎన్.ఆర్. గార్డెన్ హాల్-1లో నిర్వహించిన ఈ వేడుకలు భక్తిశ్రద్ధలతో సాగాయి. పండుగలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజల మధ్య ఐక్యతను, పరస్పర ఆప్యాయతను పెంపొందించే వేదికలుగా నిలుస్తాయని చాటిచెప్పేలా ఉత్సవ వాతావరణం కనిపించింది. బంగీయ సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు పాల్గొని దుర్గామాతకు తమ భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దుర్గామాత కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. భక్తి భావంతో నిర్వహించిన ఈ ఉత్సవం మల్లాపూర్లో ఆధ్యాత్మిక శోభను నింపింది.



# తార్నాకలో భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమం

**దుర్గామాత మండపం వద్ద యంగ్స్టార్ యూత్ అసోసియేషన్ సేవా కార్యక్రమం..**

**రవికుమార్ సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ..**

సికింద్రాబాద్, అక్టోబర్ 19 (మనం న్యూస్) ఆధ్యాత్మికతతో పాటు సేవాభావాన్ని చాటుతూ తార్నాక చింతల్బస్తీలోని దుర్గామాత మండపం వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. యంగ్స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, మురుగని రవికుమార్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సామాజిక సేవలో భాగంగా అన్నదాన కార్యక్రమానికి సహకరించిన మురుగని రవికుమార్ను అసోసియేషన్ సభ్యులు అభినందించారు. భక్తులకు సేవ చేసే అవకాశం కల్పించిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో యంగ్స్టార్ యూత్ సభ్యులు టి. హరిబాబు, సీహెచ్. మనోహర్, సీహెచ్. భాస్కర్, వేణుగోపాల్ రెడ్డి, ఎం. రాజు, టి. శాంతి, టి. లక్ష్మీనారాయణ, కర్ణ, వరుణ్, దేవా, నరేష్, యగ్నేష్, ప్రశాంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆపదలో ఉన్న బాలుడికి అండగా నిలిచిన గండికోట కుమార్

**విద్యుత్ షాక్ తో తీవ్రంగా గాయపడిన యుగ్ సింగ్ రాజ్పుత్కు రూ.5 వేల ఆర్థిక సాయం..**

**బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష.. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా..**

సికింద్రాబాద్, అక్టోబర్ 19 (మనం న్యూస్) ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని చాటుతూ డీసీసీ ప్రధాన కార్యదర్శి గండికోట కుమార్ తన ఉదారతను చాటుకున్నారు. సికింద్రాబాద్ లోని చాపల్ బాయ్ బస్తీకి చెందిన యుగ్ సింగ్ రాజ్పుత్ అనే బాలుడు ప్రమాదవశాత్తు త్రీ ఫేజ్ విద్యుత్ వైర్కు తగిలి షాక్ కు గురై తీవ్రంగా గాయపడటంతో, అతడి వైద్య ఖర్చుల కోసం రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. బాలుడికి జరిగిన ప్రమాదం గురించి తెలుసుకున్న గండికోట కుమార్ మానవీయ దృక్పథంతో స్పందించారు. బాధిత కుటుంబ సభ్యులు ఆర్థిక సాయం కోరడంతో వెంటనే సానుకూలంగా స్పందించి, బాలుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స ఖర్చుల భారం ఆ కుటుంబానికి ఇబ్బందిగా మారకూడదనే ఉద్దేశంతో తన వంతు సహాయంగా నగదును అందించారు. ఈ సందర్భంగా బాలుడు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. కష్టకాలంలో బాధిత కుటుంబం ధైర్యాన్ని కోల్పోకూడదని, వారికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్నవారికి తోడ్పడటం ద్వారా సమాజంలో మానవత్వం, పరస్పర సహకార స్ఫూర్తి మరింత బలపడుతుందని ఈ సహాయం చాటిచెప్పింది.

# పూల పరిమళాల్లో ఆత్మీయత

**నాచారం రాఘవేంద్ర నగర్ లో సద్దుల బతుకమ్మ సంబరం!..**



నాచారం, అక్టోబర్ 19 (మనం న్యూస్) పూలను పేర్చి బతుకమ్మను కొలుస్తూ.. పాటలు పాడుతూ, కోలాటాలతో సందడి చేస్తూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పారు నాచారం శ్రీ రాఘవేంద్ర నగర్ కాలనీ మహిళలు. కాలనీలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలు మహిళలు, యువతులు, చిన్నారుల ఉత్సాహంతో పండుగ శోభను సంతరించుకున్నాయి. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చిన మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బతుకమ్మ పాటలతో కాలనీ మార్మోగగా, మహిళల కోలాటాలు వేడుకలకు మరింత కళను తీసుకొచ్చాయి. పెద్దలతో పాటు చిన్నారులు సైతం ఉత్సాహంగా పాల్గొనడంతో అంతటా ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. రోజువారీ పనులు, బాధ్యతల మధ్య గడిపే మహిళలకు ఈ వేడుకలు పరస్పర పలకరింపులకు, అనుబంధాలను బలోపేతం చేసుకునేందుకు ఆహ్లాదకరమైన వేదికగా నిలిచాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కాలనీ వాసులంతా కలిసిమెలిసి భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అనంతరం బతుకమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను ముగించారు. అందంగా, ఆకర్షణీయంగా రూపొందించిన బతుకమ్మలకు శ్రీ రాఘవేంద్ర నగర్ కాలనీ తరఫున బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం మహిళల్లో ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించాలనే స్ఫూర్తిని చాటింది. పూల పరిమళాలు, పాటల మాధుర్యం, ఆత్మీయ పలకరింపుల నడుమ సాగిన ఈ సంబురం కాలనీలో ఐక్యతకు, సోదరభావానికి ప్రతీకగా నిలిచింది.



# విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు, సంతోషాలు నింపాలి

**ధర్మం, న్యాయం, ఐక్యతతో సమాజం ముందుకు సాగాలి...**

సికింద్రాబాద్, అక్టోబర్ 19 (మనం న్యూస్) చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పర్వదినం ప్రజలందరి జీవితాల్లో కొత్త ఆశలు, విజయాలు, సుఖసంతోషాలు నింపాలని గ్రేటర్ హైదరాబాద్ నగర మాజీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు మోతె శోభన్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, హైదరాబాద్ నగర వాసులకు, ప్రజాప్రతినిధులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులకు వారు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. విజయదశమి పండుగ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. దుర్గాదేవి అనుగ్రహంతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగుతూ, అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలని, ప్రజల సంక్షేమానికి చేపట్టే కార్యక్రమాలు మరింత విస్తరించాలని కోరుకున్నారు. పండుగలు ప్రజల మధ్య ప్రేమాభిమానాలను పెంపొందించడంతోపాటు సామాజిక ఐక్యతకు బాటలు వేస్తాయని వారు తెలిపారు. దసరా పండుగ అందించే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ నిజాయితీ, న్యాయం, ధర్మబద్ధమైన మార్గంలో నడుస్తూ సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల మధ్య శాంతి, సామరస్యం, సోదరభావం వెల్లివిరియాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ప్రతి ఒక్కరి జీవితంలో విజయాలు చేకూరాలని మోతె శ్రీలత శోభన్ రెడ్డి, మోతె శోభన్ రెడ్డి ఆకాంక్షించారు.

# విజయ గణపతి ఆలయంలో రాజసూయ యాగం నిర్వహిస్తాం: గవర్నర్



సైనిక్ పురి, అక్టోబర్ 19 (మనం న్యూస్): శృంగేరి శారదా పీఠం ఆధ్వర్యంలోని సైనిక్పురి కందిగూడ విజయ గణపతి ఆలయంలో త్వరలో రాజసూయ యాగం నిర్వహించనున్నట్లు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల తెలిపారు. ఆదివారం ఆలయంలో నిర్వహించిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గవర్నర్కు ఘన స్వాగతం పలికారు. లోకకల్యాణం కోసం ఆలయంలో నిత్యం హోమాలు, అభిషేకాలు, పారాయణాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకుడు పండరీనాథ్ తెలిపారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఉప్పల్ జోన్ అదనపు డీసీపీ ఆధ్వర్యంలో కుషాయిగూడ పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ పోలీస్ సిబ్బంది, అధికారులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు. ఫోటో రైట్అప్: సైనిక్పురి విజయ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల.